సాక్షి
తూర్పుగోదావరి

శనివారం । 16 । నవంబర్ । 2024



రూ.లక్ష విరాళం


తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో రాజగోపురం నిర్మాణానికి కేతఈ కుమార్‌గౌడ్ దంపతులు (కర్నూలు జిల్లా కోడుమూరు) రూ.1,00,011 విరాళం సమర్పించారు.



అన్నదాన భవనానికి రూ.లక్ష

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి దేవరకొండ వెంకట నరసమ్మ కుటుంబ సభ్యులు (కాకినాడ) రూ.లక్ష విరాళం అందజేశారు.

కడలిలోకి 17 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు, పశ్చిమ డెల్టాలకు చెరో వెయ్యి, మధ్య డెల్టాకు 800 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

బిర్సా ముండా సేవలు చిరస్మరణీయం



బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ చిన్నరాముడు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దేశ స్వాతంత్ర్యం కోసం బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు కొనియాడారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం బిర్సా ముండా జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జేసీ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జార్ఖండ్‌లోని కుంతీ జిల్లా, ఉలిహతు గ్రామంలో 1875 నవంబర్ 15న బిర్సా ముండా జన్మించారన్నారు. 1894 అక్టోబర్ 1న ఆయన ఉద్యమాన్ని ప్రారంభించారని, పేదల పక్షాన నిలబడి పలు పోరాటాలు చేశారన్నారు. 1900 ఫిబ్రవరి 3న ఆయనను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేయగా, అదే ఏడాది జూన్ 9న తుది శ్వాస విడిచారన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన సేవలకు గాను రాంచీలోని విమానాశ్రయానికి బిర్సా ముండా పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కేఎన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి రూ.1.40 లక్షల బంగారం సమర్పణ



అమ్మవారికి బంగారం తాడును సమర్పిస్తున్న ఫణికుమార్ దంపతులు

ఆత్రేయపురం: మండల కేంద్రం ఆత్రేయపురం లొల్ల లాకుల వద్ద వేంచేసియున్న దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు రెండు కాసుల బంగారం తాడును సమర్పించినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మండల పరిధిలోని నార్కెడ్‌మిల్లి గ్రామానికి చెందిన గుబ్బల ఫణికుమార్, మధుర మీనాక్షి రూ.1.40 లక్షల విలువ చేసే రెండు కాసుల బంగారం తాడును సమర్పించారన్నారు.

సత్యదేవుని సన్నిధానం.. భక్తజనసంద్రం



ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

అన్నవరం: కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని రత్నగిరి శుక్రవారం భక్తజన సంద్రమే అయ్యింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలని విధంగా జనసందోహంతో నిండిపోయింది. దేవస్థానం ఘాట్ రోడ్లు, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలు భక్తుల వాహనాలతో నిండిపోయాయి. రికార్డు స్థాయిలో సుమారు లక్ష మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని వ్రతాలు 10 వేలు జరిగాయి. కార్తిక మాసం ప్రారంభమైన తరువాత గత 15 రోజుల్లో ఇంత భారీ సంఖ్యలో భక్తులు రావడం, రికార్డు స్థాయిలో వ్రతాలు జరగడం ఇదే ప్రథమం. గురువారం రాత్రికే సుమారు 30 వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకున్నారు. స్వామివారి ఆలయాన్ని వేకువజామున ఒంటి గంటకు తెరిచి వ్రతాలు ప్రారంభించారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి భక్తులను సత్యదేవుని దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రత మండపాలు, నిత్య కల్యాణ మండపం, పాత కల్యాణ మండపాలన్నీ వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. వ్రతాల ద్వారానే దేవస్థానానికి సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. మిగిలిన విభాగాల ద్వారా రూ.40 లక్షలు కలిపి మొత్తం రూ.కోటి ఆదాయం వచ్చింది. స్వామివారి అంతరాలయ దర్శనం టికెట్టు తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో, రావిచెట్టు వద్ద, ధ్వజస్తంభం వద్ద దీపారాధన చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం దీప కాంతులతో మెరిసిపోయింది.

ఫుల్ కిక్..!



పెరవలి మండలంలోని ఓ బెల్టు షాపులో మద్యం బాటిళ్లు

- ఫోన్ కొట్టు.. మద్యం పట్టు..!
- మద్యం మాఫియా నయా దందా
- వైన్, బెల్టు షాపుల నుంచి ఆర్డర్లపై డోర్ డెలివరీ
- జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- ప్రతి గ్రామంలో అనధికారికంగా తెరచిన కూటమి సిండికేట్
- మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో అక్రమంగా విక్రయాలు
- ఎమ్మార్పీకి మించి అమ్మకాలు

సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి నేతల నేతృత్వంలోని మద్యం మాఫియా నయా దందాకు తెర తీసింది. అధికారం ఉంది కదా అని అడ్డగోలు వ్యవహారానికి తెగబడుతోంది. ఆన్‌లైన్ యాప్‌లలో బుక్ చేసుకుంటే కావాల్సిన వస్తువును నేరుగా ఇంటి వద్దకే అందించినట్లు.. ఒక్క ఫోన్ కొడితే చాలు.. నిమిషాల వ్యవధిలోనే కోరుకున్న బ్రాండ్ మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తున్నారు. పండగలు, పుట్టిన రోజు, పెళ్లి రోజు తదితర ఫంక్షన్లకు ఎక్కువ మొత్తం ఆర్డర్లు వస్తున్నాయి. దీని కోసం గరిష్ట అమ్మకం ధర (ఎంఆర్‌పీ) కంటే ఒక్కో బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ మద్యపాన ప్రియులు వెనుకాడటం లేదు. కాలు కదపకుండా గుమ్మం వద్దకే మందు వస్తోందని, ఈ ప్రక్రియ ఎంతో సౌలభ్యంగా ఉందని భావించి ఇంటికే సరకు తెప్పించుకుంటున్నారు మందుబాబులు. ధనార్జనే ధ్యేయంగా మద్యం షాపుల యజమానులు ఈ తంతుకు నాంది పలికితే.. అక్రమ సంపాదన కోసం కొందరు ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాల్లో సరుకు డెలివరీ చేస్తున్నారు. ఎలాంటి శ్రమా లేకుండా డబ్బు వస్తూండటంతో మద్యం డెలివరీ బాయ్స్ కూడా పెరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొవ్వూరు, నిడదవోలు, పెరవలి, చాగల్లు, నల్లజర్ల, ఉండ్రాజవరం, రాజానగరం, రాజమహేంద్రవరం సిటీ, రూరల్, అనపర్తి తదితర మండలాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఎన్నడూ లేని ఈ విచిత్ర సంస్కృతికి కూటమి ప్రభుత్వం నాంది పలకడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మద్యపాన ప్రియులు తప్ప తాగి, పల్లెల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తారని, గొడవలకు ఆజ్యం పోసే పరిస్థితులు తలెత్తుతాయని మహిళలు ఆవేదన చెందుతున్నారు.

బెల్టు షాపులు కేంద్రంగా..

బెల్టు షాపులే కేంద్రంగా మద్యం అక్రమ విక్రయాల దందా నడుస్తోంది. సింహభాగం మద్యం షాపులను హస్తగతం చేసుకున్న కూటమి నేతల సిండికేట్ వీటికి అనుబంధంగా బెల్టు షాపులు తెరిచింది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో బెల్టు షాపులు వెలిశాయి. అనధికారిక విక్రయాల కోసం ఏకంగా వేలం పాటలు నిర్వహించి మరీ ఎవరు ఎక్కడ విక్రయించాలో సిండికేటే నిర్ధారించింది. ఒక్కో బెల్టు షాపునకు ఆ ప్రాంతం, వ్యాపార స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ డిపాజిట్ వసూలు చేశారు. మద్యం దుకాణాలు లేని ప్రధాన కూడళ్లలో, మారుమూల గ్రామాల్లో బెల్టు షాపులు, డోర్ డెలివరీ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. గుడి, బడి అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ విక్రయించేస్తున్నారు. మద్యం దుకాణం దక్కించుకున్న వ్యాపారే సరుకు ఇస్తూండటంతో బెల్టు షాపు నిర్వాహకులు తమకు ఇష్టమొచ్చిన ధరకు విక్రయిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా బహిరంగంగానే మద్యం విక్రయాలు సాగుతున్నాయి. దుకాణాలు లేని శివారు ప్రాంతాలకు సైతం దుకాణ యజమానులు మద్యం సరఫరా చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

జిల్లా వ్యాప్తంగా అనధికారిక బెల్ట్ షాపులు, మద్యం డోర్ డెలివరీ, అక్రమ విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైన్ షాపులు, బెల్టు షాపుల నుంచి మామూళ్లు ఫిక్స్ చేసుకున్నందువల్లనే అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలున్నాయి. బెల్టు షాపుల వ్యవహారం ఇటీవల సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వైరల్‌గా కావడంతో తూతూమంత్రంగా దాడులు చేశారు. నాలుగు బాటిళ్లు పట్టుకున్నారు. కానీ, ఆ మరుసటి రోజు నుంచి బెల్టు దందా షరా మామూలుగా జరుగుతోంది. అక్రమ మద్యం విక్రయాలను, బెల్టు షాపులను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఉన్నా.. ఎక్కడా దాడులు చేసిన దాఖలాలు లేవు. ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం కార్యాలయాలకే పరిమితమవుతున్నారు తప్ప.. క్షేత్ర స్థాయిలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టడంపై దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముందస్తుగానే ప్రణాళికలు

మద్యం షాపులు దక్కించుకునే సమయంలో బెల్టు షాపులు, డోర్ డెలివరీలకు సిండికేట్ ప్రణాళికలు రూపొందించింది. మద్యం దుకాణాలకు అనుబంధంగా ఒక్కో దుకాణం పరిధిలో కనీసం 100 బెల్ట్ షాపుల ఏర్పాటుకు సమాలోచనలు చేసింది. ఈ మేరకు షాపు నిర్వాహకులతో ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నారు. ఎవరు ఎక్కడ పెట్టుకోవాలి, ఒక్కో బెల్టు షాపు నిర్వహణకు ఎంత డిపాజిట్ చెల్లించాలి, అబ్కారీ శాఖకు ప్రతి నెలా ఎంత ముట్టజెప్పాలనే విషయాలపై సిండికేట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మరీ వ్యాపారులు, బెల్టు దుకాణాల నిర్వాహకులకు దిశానిర్దేశం చేసింది.



జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో పదుల సంఖ్యలో బెల్టు షాపులు తెరిచారు. వాటి ద్వారా ఇంటి వద్దకే మద్యం అందజేసే దందాకు తెగబడుతున్నారు. బడ్డీ కొట్లు, పాన్ షాపులు, కర్రీ సెంటర్ల వద్ద యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. మండలాల వారీగా బెల్టు షాపుల వివరాలు..

మండలం	బెల్టు షాపులు (సుమారు)
నల్లజర్ల	80
గోపాలపురం	60
దేవరపల్లి	50
తాళ్లపూడి	40
నిడదవోలు	38
ఉండ్రాజవరం	35
చాగల్లు	35
రాజమహేంద్రవరం అర్బన్	28
రాజమహేంద్రవరం రూరల్	25
రాజానగరం	22
కోరుకొండ	16
కడియం	15
కొవ్వూరు	14
సీతానగరం	12
అనపర్తి	10
బిక్కవోలు	10
పెదపూడి	6

ఇసుక రీచ్‌లపై

కలెక్టర్ కన్నెర్ర

- మూత పడిన ర్యాంపులు



పెండ్యాల ఇసుక స్టాక్ పాయింట్ వద్ద కలెక్టర్ ప్రశాంతి, కొవ్వూరు ఆర్‌డీఓ రాణి సుస్మిత

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: ఇసుక రీచ్‌ల నిర్వహణపై కలెక్టర్ పి.ప్రశాంతి కన్నెర్ర చేశారు. ఇసుక ర్యాంపుల వద్ద జరుగుతున్న అక్రమాలపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. దీనికి తోడు నిడదవోలు నియోజకవర్గంలోని కానూరు– పెండ్యాల, పందలపర్రు, జీడిగుంట ఇసుక ర్యాంపుల్లో వినియోగదారులు, డ్రైవర్ల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లారీ యూనియన్ అధ్యక్షుడు రావూరి రాజా ఫిర్యాదు చేశారు. కానూరు – పెండ్యాల ర్యాంప్‌లో రాత్రి వేళ గోదావరిలోకి వెళ్లి, యంత్రాలతో లారీలకు ఇసుక లోడ్ చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో స్పందించిన అధికారులు, దాడులు చేసి ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలకు ఇసుక లోడ్ చేయకుండా స్థానికులకు అధిక మొత్తంలో సరఫరా చేస్తున్నారనే ఆరోపణ కూడా ఉంది. వీటన్నింటి నేపథ్యంలో ఆయా ర్యాంపులను కలెక్టర్ ప్రశాంతి గురువారం సాయంత్రం స్వయంగా పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అక్రమాల గురించి ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే ర్యాంపులు మూసివేయాలని ఆదేశించినట్లు చెబుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం ఈ మూడు ర్యాంపులు మూత పడ్డాయి. దీంతో ఇసుక కోసం వచ్చిన వందలాది వాహనాలు తీవ్రరు రీచ్‌కు తిరిగి వెళ్లాయి.

ఈశ్వరునికి సమర్పించుకుంటేనే దైవానుగ్రహం



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాకినాడ రూరల్: ఈశ్వరునికి మనల్ని మనం సమర్పించుకుంటేనే దైవానుగ్రహం పొందగలుతామని కాకినాడ శ్రీపీఠం అధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా శ్రీపీఠంలో శుక్రవారం రాత్రి పంచారాధన పూజలు నిర్వహించారు. వేదికపై శివపార్వతులు కల్యాణం, లక్ష వత్తుల కుందెలతో దీపారాధన నిర్వహించారు. వేలాదిగా హాజరైన భక్తులతో కార్తిక దీపోత్సవం చేయించారు. పంచారాధన విశిష్టతను స్వామీజీ వివరించారు. భక్తులతో శివపంచాక్షరిని పఠింపజేశారు. కార్తికం అమ్మవారికి ఇష్టమైన మాసమని చెప్పారు. ఓం అంటే పరమాత్ముడని, పరమేశ్వరుని దివ్య నామమని అన్నారు. హ్రీం అంటే అమ్మవారని, నమఃశివాయ అంటే పంచభూతాలని వివరించారు. ప్రతి ఒక్కరూ ఓం హ్రీం నమఃశివాయ అని స్మరించాలని సూచించారు. పవిత్రమైన మనసుతో ఈశ్వరుడిని ప్రార్థించడం ద్వారా మనశ్శాంతి లభిస్తుందని చెప్పారు.

ఏ ఉద్దేశంతో పార్టీ మారారు?

- అధికార పార్టీలో ఉండాలన్నదే మీ కోరికా?
- కేసుల భయంతో సరెండర్ అయ్యారా?
- రాజీవ్‌కృష్ణకు జక్కంపూడి రాజా సూటి ప్రశ్న

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా, నిడదవోలు నియోజకవర్గ అభ్యర్థిగా రాజీవ్‌కృష్ణకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తే.. ఆయన ఏ ఉద్దేశంతో పార్టీ మారారో చెప్పాలని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రశ్నించారు. కొవ్వూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు వైఎస్సార్ సీపీలో చేరి, ఆఖరి క్షణం వరకూ పార్టీలోనే ఉన్నారని గుర్తు చేశారు. ఆయన వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చిన రాజీవ్‌కృష్ణ పార్టీ మారడం వలన కృష్ణబాబు ఆత్మ క్షోభిస్తుందని అన్నారు. అధికార పార్టీలో ఉండాలనేదే మీ ఉద్దేశమా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్–6 హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని, అయినప్పటికీ ఏ కారణంతో టీడీపీలో చేరారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారన్న భయంతో టీడీపీకి సరెండర్ అయ్యారేమో ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. కోట్ల మంది హృదయాల్లో వైఎస్సార్ సీపీ చెరగని ముద్ర వేసుకుందన్నారు. ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తకూ అండగా ఉంటామని రాజా భరోసా ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, తమ పార్టీ నుంచి గెలిచి, టీడీపీలో చేరడం అనైతికమని అన్నారు. పార్టీ మారిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ సహా ప్రతి ఒక్కరూ తమ నైతికతను ప్రశ్నించుకోవాలని హితవు పలికారు. రాజీవ్‌కృష్ణ పార్టీని వీడడం బాధాకరమన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన అబద్ధపు హామీలకు పవన్ కల్యాణ్, పురందేశ్వరే సాక్షులని, అబద్ధపు హామీలతో ప్రజలను ఏమార్చి కూటమి గెలిచిందని విమర్శించారు. రాష్ట్రంలో డైవర్షన్ రాజకీయాలకు చంద్రబాబు తెర లేపారన్నారు. రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందంటూ ప్రచారం చేసిన చంద్రబాబు.. ఇప్పుడు ఐదు నెలల కాలంలోనే రూ.59 వేల కోట్ల అప్పులు చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజీవ్‌కృష్ణ, ఇతర నాయకుల చేరిక సమయంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని అన్నారని, వైఎస్సార్ సీపీలో ఉండి టీడీపీకి పని చేశారనే విషయాన్ని మంత్రి చెప్పకనే చెప్పారని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన టీడీపీపై రానున్న రోజుల్లో ప్రజలు తిరగబడతారన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఏ ఒక్కరూ ఎవరు అధైర్యపడనవసరం లేదని అన్నారు. జెడ్పీటీసీ, ఎంపీపీలు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసి, పార్టీ మారితే బాగుంటుందని అన్నారు. వైఎస్సార్ సీపీ ఖాళీ అంటూ కొన్ని పత్రికల్లో రాశారని, వెళ్లేవాళ్లు వెళ్తూంటారు, వచ్చేవాళ్లు వస్తూంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీకి బలమైన క్యాడర్ ఉందని, కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ మండల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, కంఠమణి రమేష్, దేవగుప్తాపు లక్ష్మణరావు, గంధం శేషసాయి, నగ్గళ్లపాటి శ్రీనివాస్, కవల నాగేశ్వరరావు, చిట్టూరి అన్నవరం, బోడపాటి హనుమంతరావు, కొయ్య దుర్గారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, తలారి వెంకట్రావు

గిరులూ తరులూ.. భక్తజన సిరులు

- ఘనంగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ
- తరలివచ్చిన 2 లక్షల మందికి పైగా భక్తులు
- ఉదయం పల్లకీతో.. మధ్యాహ్నం ప్రచార రథంతో నిర్వహణ
- కోలాటాలు, భజనలతో మార్గమంతా కోలాహలం
- గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్

అన్నవరం: కొండ ఎక్కి తన దర్శనానికి రాలేని భక్తులకు.. తన గిరులపై జన్మించిన వృక్షాలు, పక్షులు, జంతువులకు.. నిత్యం తనను అభిషేకించే పంపానదికి.. తన దర్శన భాగ్యం కల్పించేందుకు.. ఆ సమస్త జీవుల పాపాలు తొలగించేందుకు.. సర్వజగద్రక్షకుడైన ఆ రత్నగిరి వాసుడే స్వయంగా కొండ దిగి వచ్చిన వేళ అన్నవరం పుణ్యక్షేత్రం భక్తజన సంద్రమే అయ్యింది. భక్తవరదుడైన సత్యదేవుడు దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవితో కలిసి పల్లకీపై, ప్రచార రథంపై కొలువుదీరి తమ చెంతకు చేరుకున్న వేళ భక్తులు పులకించిపోయారు. లక్షలాది భక్తజనం వెంట రాగా.. కార్తిక పౌర్ణమి పర్వదినమైన శుక్రవారం.. సత్యదేవుని గిరి ప్రదక్షిణ నభూతో.. అనే రీతిలో ఘనంగా జరిగింది. ఉదయం 8 గంటలకు పల్లకీ మీద, మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం మీద సాగిన ఈ గిరి ప్రదక్షిణలో రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన 2 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఉదయం పల్లకీ మీద జరిగిన గిరి ప్రదక్షిణలో తక్కువ మంది భక్తులు పాల్గొన్నప్పటికీ.. మధ్యాహ్నం ప్రచార రథంతో సాగిన ఈ ఉత్సవానికి భక్తులు ప్రవాహంలా పోటెత్తారు. రత్నగిరి, సత్యగిరి చుట్టూ సత్య రథంలో సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో సుమారు 4 గంటల పాటు సాగిన ఈ గిరి ప్రదక్షిణలో ఆద్యంతం భక్తితరంగాలు ఎగసిపడ్డాయి. భక్తులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ అంటూ స్వామివారి నామం జపిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ మార్గం 11 కిలోమీటర్ల పొడవునా ఇసుక వేస్తే రాలని రీతిలో భక్తజన ప్రవాహం దర్శనమిచ్చింది. స్వామివారి ప్రచార రథానికి ఇరువైపులా చెరో మూడు కిలోమీటర్ల మే భక్తులు సత్యదేవుని నామం పలుకుతూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అశేషంగా భక్తులు తరలిరావడంతో అన్నవరం మెయిన్ రోడ్డుపై సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

పోలీసులకు డబుల్ డ్యూటీ

గిరి ప్రదక్షిణ ఉదయం, మధ్యాహ్నం జరగడంతో పోలీసులు రెండుసార్లు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, మరో వంద మంది పోలీసులు, రోప్ పార్టీ సిబ్బంది రెండుసార్లు విధుల్లో పాల్గొన్నారు. రోప్ పార్టీ పోలీసులు మొత్తం 22 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నట్లు అయింది.

ప్రదక్షిణ సాగిందిలా..

గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు వేలాదిగా మంది భక్తులు మధ్యాహ్నం ఒంటి గంటకే రత్నగిరి దిగువన తొలి పావంచా వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ రత్నగిరి పై నుంచి తొలి పావంచా వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పండితులు ప్రత్యేక పూజలు చేసి, ప్రచార రథంపై వేంచేయించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్‌లు కొబ్బరి కాయలు కొట్టి స్వామి, అమ్మవార్ల గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. భజనలు, కోలాట నృత్యాలతో గిరి ప్రదక్షిణ ఆద్యంతం కోలాహలంగా సాగింది. మహిళల భక్తి గీతాల నడుమ సత్య రథంతో గిరి ప్రదక్షిణ సాగింది.

తొలి పావంచా నుంచి అన్నవరం మెయిన్ రోడ్డు మీదుగా బెండపూడి సమీపంలోని పుష్కర కాలువ వద్దకు మధ్యాహ్నం 3 గంటలకు సత్య రథం చేరుకుంది. అక్కడ భక్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పుష్కర కాలువ వెంబడి పంపా తీరం వరకూ గిరి ప్రదక్షిణ సాగింది. మధ్యలో మూడుచోట్ల స్వామి, అమ్మవార్లకు భక్తులు ఘన స్వాగతం పలికారు. ఆ ప్రదేశాల్లో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. గిరి ప్రదక్షిణ పంపా ఘాట్‌కు సాయంత్రం 5.30 గంటలకు చేరింది. ఆ సమయానికి కూడా భక్తులు తరలి వస్తూనే ఉండటం విశేషం. స్వామి, అమ్మవార్లకు పండితులు పంపా ఘాట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఊరేగింపుగా రత్నగిరికి చేర్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, ఈఓతో పాటు వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం అవధాని, చిట్టి శివ ఘనపాఠి, సంతోష్ ఘనపాఠి, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, దత్తు శర్మ, సుధీర్, పవన్, వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడు, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సత్యదేవుని గిరి ప్రదక్షిణలో భక్తజన ప్రవాహం

స్వల్పంగా ఇబ్బందులు

- గిరి ప్రదక్షిణ సాగిన పుష్కర రోడ్డు మీద భక్తుల పాదలకు రాళ్లు గుచ్చుకోకుండా గతంలో గడ్డి వేసేవారు. ఈ ఏడాది అలా చేయలేదు. చాలా మంది భక్తులు జోళ్లు లేకుండానే గిరి ప్రదక్షిణలో పాల్గొనడంతో చిన్న చిన్న గులకరాళ్లు పాదాలకు గుచ్చుకొని ఇబ్బందులు పడ్డారు.
- ఉదయం 8 గంటలకు స్వామివారి పల్లకీతో నడిచిన భక్తులకు మంచినీరు తప్ప ఫలాలు, ఫలహారాలు పంపిణీ చేయలేదు. గిరి ప్రదక్షిణ చివరిలో వ్రత పురోహిత సంఘం ఆధ్వర్యాన మాత్రమే మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం గిరి ప్రదక్షిణ భక్తులకు మాత్రం 25 స్టాల్స్ ద్వారా అన్నీ పంపిణీ చేశారు. అయితే అంచనాకు మించి భక్తులకు రావడంతో అవి సరిపోలేదు.



గిరి ప్రదక్షిణ పథంలో పల్లకీలో కొలువుతీరిన సత్యదేవుడు, అమ్మవారు



గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్

క్లుప్తంగా

సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు

మామిడికుదురు: హైదరాబాద్ గుడి మల్కాపూర్‌లో నివాసం ఉంటున్న ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం కనిగిరికి చెందిన మునగాల హరీశ్వర్‌రెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం పోలీసులు పీటీ వారెంటుపై అదుపులోకి తీసుకున్నారు. అతడిని శుక్రవారం ముమ్మిడివరం కోర్టులో హాజరు పరిచి, రిమాండుకు తరలించామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులపై హరీశ్వర్‌రెడ్డి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నగరం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు, పి.గన్నవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జాలెం సుబ్బారావు ఈ నెల 8న ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.

మృతదేహం గుర్తింపు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కాలువలో మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దార్వపూడి గ్రామానికి చెందిన బుద్దాల నాగశ్రీ(49) అనే మహిళ మృతదేహంగా దీన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనపర్తి సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: భర్త, అత్త, ఆడపడుచు తనను అదనపు కట్నం కోసం శారీరకంగాను, మానసికంగాను వేధిస్తున్నట్టు పట్టణానికి చెందిన చెరుకూరి నాగ సౌజన్య ఇచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. తనకు కొవ్వూరు పట్టణానికి చెందిన వెంకట సురేంద్రతో వివాహం అయిందని, ఒక కుమార్తె పుట్టిందని పేర్కొన్నారు. కొంతకాలం కాపురం సాఫీగా సాగిందని, అనంతరం భర్తతో పాటు అత్త, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

రూ.2 లక్షల విలువైన సొత్తు చోరీ

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలోని చల్లా సత్యనారాయణమూర్తి ఇంట్లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన చోరీలో రూ.2 లక్షల విలువైన బంగారు నగలు, వెండి వస్తువులను దొంగలు దోచుకున్నారు. డాబా ఇంటి పై అంతస్తులో సత్యనారాయణ మూర్తి దంపతులు నిద్రించిన సమయంలో డాబా గ్రౌండ్ ఫ్లోర్‌లో చోరీ జరిగింది. తలుపుల బోల్టులు సరిగా లేకపోవడంతో దొంగలు ఈ తలుపులను దోచుకుని ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. దొంగలు ఇంట్లో ఉన్న ఆరు కాసుల బంగారు వస్తువులు, కిలోన్నర వెండి వస్తువులను దోచుకున్నట్లు చెప్పారు. బాధితుడు సత్యనారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు.



అమలాపురం కామాక్షీ పీఠంలో రాహు కాల దీపాలు వెలిగిస్తున్న మహిళలు



కార్తిక పౌర్ణమి సందర్భంగా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానమాచరిస్తున్న భక్తులు

వైభవంగా కార్తిక పుణ్యమి!

కార్తిక పౌర్ణమి సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరిలోని తీర్థాల్లో పుణ్య స్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులతో స్నానఘట్టాలు కిటకిటలాడాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే నదీ తీరాలు భక్తజన సంద్రంగా మారాయి. రాజమహేంద్రవరంలోని పుష్కర, సరస్వతీ, కోటిలింగాలు తదితర ఘాట్‌లు, కొవ్వూరు గోష్పాదక్షేత్రం, ద్రాక్షారామ సప్త గోదావరి, పిఠాపురంలోని పుష్కరిణులకు జనం పోటెత్తారు. స్నానాలు ఆచరించి నది ఒడ్డున పూజలు చేశారు. కార్తిక దీపాలను నదిలో విడిచిపెట్టారు. ఆలయాలు, స్నానఘట్టాలు దీప కాంతులతో కళకళలాడాయి. మహిళలు ఉపవాసాలు, దీపదానాలు చేశారు. రాత్రి శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో జ్వాలాతోరణం నిర్వహించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తజనం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారికి తొలి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణం



దీపదానం చేస్తున్న దంపతులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు

అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు

ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్

గోకవరం: సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా గోకవరం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని, ఇటువంటి మెసేజ్‌లు పెట్టే వారిని గ్రూపు అడ్మిన్లు గుర్తించి హెచ్చరించాలన్నారు. లేనిపక్షంలో అడ్మిన్‌లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు రేంజి పరిధిలో ఆరు జిల్లాల్లో చిన్న పిల్లలు, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీరి రక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వీరు ఈవ్ టీజింగ్‌పై ప్రత్యేకంగా పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, మహిళలు అధికంగా పని చేసే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. తూర్పు గోదావరి జిల్లా ఏజెన్సీకి ముఖద్వారంగా ఉండటంతో పెద్ద ఎత్తున గంజాయి రవాణా జరుగుతోందన్నారు. ఎప్పటికప్పుడు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి రాజమహేంద్రవరం వచ్చి గంజాయి వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం ఉందని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. తరచూ గంజాయి రవాణా చేసే వారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తున్నామన్నారు. రేంజి పరిధిలో పెండింగ్ కేసులను త్వరితగతిన ముగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. నేరాల అదుపునకు ఆరు జిల్లాల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్య కూడళ్లలో లక్ష కెమెరాలు ఏర్పాటు చేయాలని గుర్తించామన్నారు. ఎస్పీ డి.నరసింహకిశోర్, సీఐ సత్యకిశోర్, ఎస్సై పవన్‌కుమార్ ఉన్నారు.



గోకవరం పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల పనితీరు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సత్యనారాయణ

కోటనందూరు: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం..అప్పలరాజుపేట గ్రామానికి చెందిన బంగారు వీరవెంకటసత్యనారాయణ కోటనందూరు కోఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగి. ఈ నెల 12 విధి నిర్వహణలో భాగంగా కోటనందూరులోని కో ఆపరేటివ్ సొసైటీకి వెళ్లిన ఆయన తిరిగిరాలేదు. ఆరోజు విధులకు కూడా హాజరు కానట్లు సొసైటీ సిబ్బంది ద్వారా తెలుసుకున్న కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో సత్యనారాయణ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 96524 98598, 96765 75832 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెన నుంచి శుక్రవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కి చెందిన నరాల మంజులను పట్టణ పోలీసులు కాపాడారు. ఆ మహిళను పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్లారు. అనంతరం ఆమె భర్త సత్యనారాయణను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కౌన్సెలింగ్ అనంతరం ఇద్దరినీ ఇంటికి పంపినట్లు ఆయన తెలిపారు.

అక్కు వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పీఆర్ విద్యార్థుల ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల పురుషులు, మహిళల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారని పీడీ డాక్టర్ వర్మ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలలో 6 బంగారు, 5 రజత పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రుపాణ్యం, పీడీ రమణ విద్యార్థులను, గేమ్స్ బాయ్ శ్రీనును అభినందించారు.

ఎయిర్‌బస్సులు వచ్చేస్తున్నాయ్!

- డిసెంబర్ ఒకటిన ముంబయి, 12 నుంచి ఢిల్లీకి సర్వీసులు
- ఒక్కోదానిలో 180 మంది ప్రయాణించే వీలు
- ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు సేవలందిస్తున్న 10 చిన్న విమానాలు



రాజమహేంద్రవరం విమానాశ్రయం టెర్మినల్ భవనం

మధురపూడి: ఉభయ గోదావరి జిల్లాల ప్రయాణికులకు సేవలందిస్తున్న రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబయికి డైరెక్ట్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ముంబయికి, 12వ తేదీ నుంచి ఢిల్లీకి ప్రయాణాలు మొదలు కానున్నాయి. వ్యాపారస్తులు, వివిధ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి ఉద్యోగులకు ఈ సర్వీసులు ప్రయోజనకరం కానున్నాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబయికి రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు, ఓఎన్‌జీసీ, గెయిల్, తదితర పెద్ద సంస్థలకు చెందిన ఉద్యోగులు చుట్టూ తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. వీరు హైదరాబాద్ వెళ్లి, అక్కడి నుంచి ప్రయాణాలు సాగించేవారు.

ప్రయాణికులకిదే ప్రథమం

రాజమహేంద్రవరం విమానాశ్రయానికి ఎయిర్ బస్సులు రావడం ఇది రెండోసారి. రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంలో బ్రిటిష సైనికుల రాకపోకలకు ఎయిర్ బస్సులు ఇక్కడకు వచ్చాయి. కాగా ప్రయాణికులను తరలించడానికి ఇక్కడికి ఎయిర్ బస్సులు రావడం ఇదే తొలిసారవుతుంది. ఈ మేరకు ఇప్పటికే గగన తలంలో ట్రైల్ వేశారు. ఇక పెద్ద శబ్దంతో ఎయిర్‌బస్సులు రన్‌వే పైన ల్యాండ్ కానున్నాయి.

180 మంది ప్రయాణికుల సామర్థ్యం

ఈ రెండు ఎయిర్‌బస్సులు ఒక్కోటి 180 మంది ప్రయాణించడానికి అనువుగా సీట్లుంటాయి. దీంతో రోజూ 720 మంది రాకపోకలు జరగడానికి అవకాశం ఉంటుంది. ఇంత సామర్థ్యం గల విమానాలు ఇప్పటివరకూ రాజమహేంద్రవరం విమానాశ్రయానికి రాకపోకలు నిర్వహించలేదు. ప్రస్తుతం రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి 10 చిన్న విమానాలు నడుస్తున్నాయి. హైదరాబాద్‌కు 7, బెంగళూరుకు 2, చెన్నైకు ఒకటి చొప్పున రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో 72 సీట్లుంటాయి. కాగా 58–65 మంది చొప్పున ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ విమాన సర్వీసుల ద్వారా రోజూ 1,300 మంది ప్రయాణిస్తున్నారు.

రాకపోకలు ఇలా..

డిసెంబర్ ఒకటో తేదీన 6ఇ 582 విమాన సర్వీసు ముంబయి నుంచి 16–50 గంటలకు బయలుదేరి, రాజమహేంద్రవరం విమానాశ్రయానికి 18–45 గంటలకు చేరుతుంది. 6ఇ 583 విమాన సర్వీసు రాత్రి 19–15 గంటలకు రాజమహేంద్రవరం నుంచి ముంబయికి బయలుదేరి 21–05 గంటలకు చేరుతుంది. డిసెంబర్ 12 తేదీన 6ఇ364 విమాన సర్వీసు ఢిల్లీ నుంచి 7–30 గంటలకు బయలుదేరి, 9–45 గంటలకు రాజమహేంద్రవరం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 6ఇ363 సర్వీసు 10–30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఢిల్లీ చేరుతుంది.

కృషి ఫలించింది



రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ, ముంబయిలకు సర్వీసులు నడిపేందుకు చేసిన కృషి ఫలించింది. ఈ విమానాశ్రయానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు రానున్నందుకు గర్వంగా ఉంది. పెద్ద విమానాలైన ఎయిర్‌బస్సుల రాక మొదలవడంతో సుదూర ప్రాంతాలకు సునాయాసంగా ప్రయాణాలు సాగించవచ్చు.

– ఎస్.జ్ఞానేశ్వరరావు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్, రాజమహేంద్రవరం

మహాసేన రాజేష్‌తో పాటు మరికొందరిపై కేసు

మలికిపురం: ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచికి చెందిన సరిపెళ్ల రాజేష్ (మహాసేన రాజేష్), అతని అనుచరులు మరో ఐదుగురిపై మలికిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పీ సురేష్ శుక్రవారం తెలిపారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టినటు శంకరగుప్తంకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు ఇచ్చిందన్నారు. ఈ మేరకు రాజేష్‌తో పాటు భీమవరానికి చెందిన వీరవల్లి ఏసుబాబు, రాజోలుకు చెందిన రంజిత్ మెహ్రా, తూర్పుపాలెంకు చెందిన యెల్లమిల్లి పండు, తునికి చెందిన బోడపాటి చక్రి, మరో వ్యక్తి పృథ్వీరాజ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో మహాసేన రాజేష్, అతని అనుచరులు ఈ పోస్టులు పెట్టినట్టు ఆమె ఫిర్యాదులో వెల్లడించిందని ఎస్సై పేర్కొన్నారు.

ఉత్కంఠంగా జిల్లా అండర్-13 చెస్ పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులు

అమలాపురం టౌన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలోని ఒక ప్రైవేటు స్కూలులో జిల్లా అండర్–13 చెస్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 మంది చెస్ క్రీడాకారులైన విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి హాజరై తమ సత్తా చాటారు. ఈ పోటీల ద్వారా బాలుర విభాగం నుంచి ఇద్దరిని, బాలికల విభాగం నుంచి ఇద్దరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. చెస్ చాంపియన్‌గా బాలురలో తాడి వెంకట సాయి వెంకటేష్, బాలికల్లో బి.బ్లెస్సీ ఎంపికయ్యారు. బాలుర విభాగంలో తాడి సాయి వెంకటేష్, సాధనాల శ్రీసంతోష్ ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బాలికల విభాగంలో బి.బ్లెస్సీ, పనిశెట్టి ధరణి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వీరు ఈ నెల 19న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్–13 చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వెంకట సురేష్ తెలిపారు.



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు

కాకినాడ సిటీ: నూతన జాతీయ విద్యా విధానం వల్ల భారతదేశంలో విద్యావ్యవస్థ విచ్ఛిన్నమవుతుందని, దాన్ని వ్యతిరేకించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పి.జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కాకినాడ సూర్యకళామందిర్‌లో ఏఐఎస్ఎఫ్ కాకినాడ జిల్లా ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. 89వ ఆవిర్భావ దినోత్సవం రాష్ట్రంలో ఘనంగా నిర్వహించామన్నారు. విద్యార్థులు రావడం ద్వారానే రాజకీయాల ప్రక్షాళన జరుగుతుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని, సెక్యులర్ స్వేచ్ఛ, సమానత్వం కోసం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని జాన్సన్‌బాబు అన్నారు. కేంద్రం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయించి ప్రాథమిక విద్యను కాపాడాలన్నారు. త్వరలో విజయనగరంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్, ఏ నాగలక్ష్మి, రమేష్, సహాయ కార్యదర్శులుగా తంగెళ్ల అక్షయ్, దీప్తి, కోశాధికారిగా శ్రీరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సభలో మాట్లాడుతున్న జాన్సన్‌బాబు